క్లుప్తంగా

రేపు మెగా ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లి రూరల్: చినకాకాని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం మంగళగిరి శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏషియల్ వ్యాస్కులర్ హాస్పటల్ సహకారంతో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు పూసపాటి సాయి కృష్ణ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన వైద్య శిబిరానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. వైద్య శిబిరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందన్నారు. గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి భజన మండలి కన్వీనర్ డాక్టర్ రాయపాటి రామారావు, హాస్పటల్ మార్కెటింగ్ మేనేజర్ వి.నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి జెడ్పీపీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా తెలుగు యువత పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలలో ఈ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు చిగురుశెట్టి రాజా రమేష్, టీడీపీ అధ్యక్షులు వంగ నరేంద్ర, లింగంశెట్టి కిషోర్, గోపాల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

తాడేపల్లి రూరల్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని.. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని మున్సిపల్ కార్మికులు శుక్రవారం తాడేపల్లిలో ప్రదర్శన నిర్వహించారు. కార్మికులు ప్యారీకంపెనీ గేటు మీదుగా బోసుబొమ్మ సెంటర్, మేకా అమారెడ్డి భవన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మేకా అమారెడ్డి భవన్‌లో పి.కృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు చేస్తున్న పోరాటానికి సీఐటీయూ మద్దతు తప్పక ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, డి.వెంకట్‌రెడ్డి, వేణు, డేవిడ్, మున్సిపల్ కార్మికులు రంగమ్మ, కొండయ్య, కామాక్షి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహంకాళీ ఆలయంలో రోటరీ సేవలు



దుగ్గిరాల: పర్యావరణం పరిరక్షణలో భాగంగా శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం ఆవరణలో రోటరీ క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. శుక్రవారం రోటరీ తెనాలి, మంగళగిరి క్లబ్‌ల ఆధ్వర్యంలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకటపూర్ణచంద్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటారు. ఫారెస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అన్నే రత్న ప్రభాకర్ కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన ఈవో కె.సునీల్‌కుమార్, అనిల్‌కుమార్, నల్లూరి వెంకటేశ్వరరావు, పి.రాజశేఖర్, నిరంజన్ గుప్తా, శ్రీనివాస్, మురళీ, బాలకృష్ణ, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో రికార్డుల తనిఖీ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మన గ్రోమోరు కేంద్రం, విత్తనాలు అమ్మే దుకాణం, తులసీ సీడ్స్‌లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. అంతర్ జిల్లాల తనిఖీ అధికారి వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు కె.మురళీకృష్ణ, విజిలెన్స్ సీఐ వెంకటేశ్వర్లు, ఏవో వాసంతిలు దుకాణంలోని పలు రికార్డులను పరిశీలించారు. దస్తావేజు బిల్లులు, స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేశారు. అనంతరం అమీనాబాద్ గ్రామ పరిధిలోని తులసీ సీడ్స్‌లో విత్తన ఉత్పాదన, అమ్మకాలు, ప్యాకింగ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు షేక్ సుభాని, ఎంపీఈవో బి.హకీంలు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

దుగ్గిరాల: విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించామని ఏవో ఆర్.విజయబాబు తెలిపారు. శుక్రవారం రేవేంద్రపాడు, ఈమని గ్రామాలలోని పలు దుకాణాలలో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రూ.23.60 లక్షల విలువ గల 82.39 క్వింటాల విత్తనాలు.. రూ.52 వేలు విలువ గల 110 కిలోల ఎరువులు.. రూ.44 వేలు విలువ గల 27.5 కిలోల పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశామని ఏవో తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ తిరుమలాదేవి, విజిలెన్స్ అధికారి రవిబాబు, గుంటూరు మండల వ్యవసాయ అధికారి బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న కాడెద్దులు!

- ఆదరణ కోల్పోతున్న ఎడ్లబండ్లు
- ట్రాక్టర్లు, హార్వెస్టర్లతో వ్యవసాయ పనులు
- ఖర్చు తక్కువ.. సమయం ఆదా



ఎద్దులతో దుక్కి దున్నుతున్న రైతు(ఫైల్)

తాడేపల్లి రూరల్: పొలం దున్నాలన్నా.. విత్తు విత్తాలన్నా.. పండించిన పంట ఇంటికి చేరాలన్నా కాడెద్దులు కావాల్సిందే. వ్యవసాయంలో వాటి పాత్ర చాలా కీలకం. అయితే ఇదంతా గతం. ఇప్పుడు వాటి స్థానంలో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఎద్దులతో ఒకరోజు చేసే పని యంత్రాలతో రెండు మూడు గంటల్లో జరిగిపోతోంది. దీంతో విత్తనం మొదలు పంట కోత వరకూ యంత్రాలనే వినియోగిస్తున్నారు. ఇది కొంత ఖర్చుతో కూడుకున్నది. అయినా సమయం ఆదా అవుతుండడంతో అధిక శాతం మంది రైతులు యంత్రాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా ఒకప్పుడు రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచిన ఎద్దులు నేడు క్రమంగా కనుమరుగవుతున్నాయి.

గతంలో అద్దెకు ఎద్దులు..

వ్యవసాయంలో ఎద్దులతో రైతులకు విడదీయరాని బంధం ఉంది. దీంతో ఇది వరకు గ్రామాల్లో రెండు, మూడు ఎకరాలు ఉన్న ప్రతి రైతుకు కనీసం ఒక జత ఎద్దులు ఉండేవి. ఎద్దులు లేని రైతులు అద్దెకు పిలిపించుకుని పొలాలను తయారు చేసుకునే వారు. రానురాను దుక్కి దున్నడం నుంచి పంట ఇంటికి చేర్చేవరకు ప్రతి పని యంత్రాలతో జరిగిపోతుండడంతో కాడెద్దులపై రైతులు మొగ్గు చూపడంలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో జత ఎద్దులను కొనాలంటే రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ధర పలుకుతున్నాయి. అంత పెట్టుబడి పెట్టి కాడెద్దులను తీసుకొచ్చి వాటిని పోషించడం తలకు మించిన భారం అవుతోందని యంత్రాల వైపు రైతన్నలు చూస్తున్నారు.

యాంత్రీకరణ దిశగా వ్యవసాయం..

నూతన యాంత్రీకరణ దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. వ్యవసాయంలో ప్రతి పనికి యంత్రాలు రావడంతో వ్యవసాయం సులభతరంగా మారింది. దుక్కి దున్నడం మొదలు దమ్ము చేసి వరినాట్లు వేసే వరకూ యంత్రాలను ఉపయోగిస్తున్నారు. దీంతో పాటు పండిన పంటలను కోత కోసి ఇంటికి చేర్చే వరకు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి.

భారమవుతున్న పశుపోషణ..

కాడెద్దులను పోషించడం రైతులకు భారంగా మారింది. ట్రాక్టర్ ఎండుగడ్డి రూ.16 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంది. ఇక దాణ, పచ్చిగడ్డి, సంరక్షణ ప్రతీదీ రైతుకు భారమవుతోంది. దీంతో రైతులు ఉన్న ఎద్దులను అమ్మేసి యంత్రాల వైపు మొగ్గుచూపుతున్నారు. గతంలో గ్రామానికి 15–20 కాండ్ల ఎద్దులు ఉండేవి. పశుపోషణ భారంగా అవుతోందని యంత్రాలతో త్వరగా పని అవుతోందని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

రైతుల సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



అర్జీలు స్వీకరిస్తున్న నోడల్ అధికారిణి జయశ్రీ

తాడికొండ: రైతుల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని జీఆర్ఎం నోడల్ అధికారిణి పి.జయశ్రీ అన్నారు. రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీయే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఆమె రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమీకరణ పథకం, వార్షిక కౌలు చెల్లింపు తదితర సమస్యల గురించి పలువురు రాజధాని ప్రాంత వాసులు తమ అర్జీలను గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్(జీఆర్ఎం) నోడల్ అధికారిణి జయశ్రీకి అందజేశారు. ఇచ్చిన ఫిర్యాదులలో పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా మిగిలినవి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, కేఎస్.భాగ్యరేఖ, పి.పద్మావతి, జి.రవీందర్, జి.భీమారావు, ఎ.జి.చిన్నికృష్ణ, సీఆర్డీయే సర్వే విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ జి.పాండురంగారావు రామకృష్ణన్, సీఆర్డీయే సామాజిక సంక్షేమ విభాగ డీసీడీవో బి.శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లు లేక రోడ్లపై నిలిచిన వర్షపు నీరు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని కాజ, వెంకటరెడ్డిపాలెం అండర్‌పాస్ వద్ద వర్షపు నీరు వెళ్లే దారి లేక రోడ్లపై నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడిన ప్రతిసారీ ఇక్కడ ఇదే సమస్య. అయినా ఎంటీఎంసీ అధికారులు కానీ, ఎన్‌హెచ్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విలీన గ్రామాలపై తొలినుంచి అధికారులు శ్రద్ధ చూపడం లేదని స్థానికులు వాపోతున్నారు. సమస్య పరిష్కారానికి డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుండె సమస్యలకు నూతన పరిష్కారం

కేఎల్‌యూ విద్యార్థిని పరిశోధన



శ్రేయ కొసనం

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో పరిశోధన విద్యార్థిని శ్రేయ కొసనం గుండె సంబంధిత సమస్యలకు మొక్కల ఆధారిత చికిత్సలకు నూతన పరిష్కారాలను కనుగొన్నట్లు కేఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రాజేశ్వరి పసుపుల మార్గదర్శకత్వంలో గుండె సంబంధిత వ్యాధులపై పరిశోధన చేసిన శ్రేయ సాంప్రదాయ మొక్కల నుంచి గుండెకు ఏర్పడే పలు రకాల సమస్యలకు ఔషధాలు తయారు చేయవచ్చుననే నివేదికను తయారు చేసినట్లు ఆయన తెలిపారు. అందుకు గానూ శ్రేయ కేఎల్ ఫార్మసీ కళాశాల నుంచి పీహెచ్‌డీ డిగ్రీని అందుకున్నట్లు పేర్కొన్నారు. ఆమె చేసిన పరిశోధనను మెడికల్ పరిభాషలో 'ఇన్వెస్టిగేషన్స్ ఆఫ్ మిథైల్ గ్లైకోసైడ్ అండ్ సిన్నమోయిల్ డెరివేటివ్ ఫ్రమ్ అగనోస్మా డైకోటోమా ఎగైనెస్ట్ మయోకార్డియల్ ఇస్కీమియా–రిపెర్ఫ్యూజన్ ఇంజురీ, ఇంటిగ్రేటింగ్ కంప్యూటేషనల్ టెక్నిక్స్ విత్ సెల్ లైన్ వాలిడేషన్ యూజింగ్ హెచ్9సీ2 కార్డియో మయోసైట్స్' అనే తన థీసిస్‌కు గానూ కేఎల్‌యూ ఫార్మసీ కళాశాల వారు శ్రేయకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్రవర్తి, డైరెక్టర్ డాక్టర్ బుచ్చినాయుడు, ఆర్ ప్యాక్ చైర్మన్ డాక్టర్ నరేంద్ర పరిశోధనా విద్యార్థిని శ్రేయను అభినందించారు.

దేవస్థాన పునః నిర్మాణానికి విరాళం



మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని కుప్పరావుకాలనీలో పునః నిర్మిస్తున్న హనుమత్ లక్ష్మణ సీతా సమేత శ్రీ రాముల వార్ల దేవస్థానానికి మంగళగిరి ఎమ్మెల్యే, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళాన్ని స్థానిక నాయకులు శుక్రవారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ.. శ్రీ రాముని కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని అన్నారు. కార్యక్రమంలో టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నాయకులు వాసా పద్మ, తిరువీధుల సతీష్, బిక్షారావు, బత్తుల శ్రీను, గుంటి మోహన్, దేవస్థానం కమిటీ అధ్యక్షులు మునగాల వెంకట రత్నం, ఉపాధ్యక్షులు కొల్లి హనుమంతరావుపాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడు వీరంగం

- ఆటోతో ప్రభుత్వ ఉద్యోగి కారును ఢీకొట్టిన యువకుడు
- ఆపై ప్రభుత్వ ఉద్యోగిపై దాడి
- పోలీసులపై సైతం దాడికి దిగిన యువకుడు



పోలీసులపై విరుచుకుపడుతున్న యువకుడు

మంగళగిరి టౌన్: మద్యం మత్తులో ఓ యువకుడు నడిరోడ్డుపై వీరంగం సృష్టించాడు. ఆటోతో ఓ ప్రభుత్వ ఉద్యోగి కారును ఢీకొట్టడమే కాకుండా ఆ ఉద్యోగిపై దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా అడ్డుకోబోయిన పలువురిపై ముష్టిఘాతాలు కురిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసులపై సైతం విరుచుకుపడ్డాడు.

సేకరించిన వివరాల ప్రకారం..

గురువారం సాయంత్రం సీతారామ కోవెల ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు ఆటోలో ఆటోనగర్‌కు వెళుతున్నారు. అదే సమయంలో ఆటోనగర్‌లో ఏపీఐఐసీలోని డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖలో పనిచేస్తున్న డేటా ఎనలిస్ట్ శ్రీనివాసరావు తన విధులు ముగించుకుని కారులో వస్తున్నారు. ఈ క్రమంలో యువకుడు మద్యం మత్తులో శ్రీనివాసరావు కారును ఢీకొట్టాడు. అంతటితో ఆగకుండా అతనిపై యువకుడు దాడికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపై సైతం ముష్టిఘాతాలు కురిపించాడు. పట్టణ ఎస్ఐ రవీంద్ర నాయక్ తన సిబ్బందితో సంఘటనా ప్రాంతానికి చేరుకోగా పోలీసులపై సైతం యువకుడు విరుచుకుపడ్డాడు. చివరకు ఎస్ఐ రవీంద్రనాయక్ నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా స్థానిక కూటమి కీలక నేత కేసును రాజీ చేయడం గమనార్హం. దీంతో పోలీసులు సైతం నిరుత్సాహ పడినట్లు విశ్వసనీయత సమాచారం.

దుగ్గిరాలలో గ్రామ సభ నేడు

దుగ్గిరాల: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛదివాస్‌లో భాగంగా శనివారం దుగ్గిరాలలో గ్రామ సభ నిర్వహించనున్నామని గ్రామ కార్యదర్శి వివేకానంద శుక్రవారం తెలిపారు. ప్లాస్టిక్ వల్ల కలిగే కాలుష్య నివారణపై సమావేశం జరుగుతుందని.. సర్పంచ్ ఖతీభాయి కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారని ఆయన పంచాయతీ కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

కాకుమాను: విద్యార్థులకు రోజూ కడుపు నిండా భోజనాన్ని అందించాలని ఎంఈవో కె.ఎఫ్.కెన్నడీ అన్నారు. పెదనందిపాడు మండలంలోని గొరిజవోలుగుంటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ఆయన ఎంఈవో–2 జాకబ్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కెన్నడీ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలకు సూచించిన మెనూ తప్పని సరిగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు. పాఠశాలలోని ఉపాధ్యాయుడు రత్నారెడ్డి గత రెండేళ్లగా తమ సొంత ఖర్చుతో విద్యార్థులకు పెరుగును సరఫరా చేస్తుండడంతో ఆయనను ఎంఈవోలు అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహాయం

దుగ్గిరాల: దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధికి జంపాల సుబ్బారావు రూ.10 వేల విరాళాన్ని శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు యస్.శోభాదేవికి అదించారు. పాఠశాల అభివృద్ధి, పలు మరమ్మతుల పనుల నిమిత్తం నగదు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

వెంగళాయపాలెంలో స్వచ్ఛ రథం

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో శుక్రవారం పైలట్ ప్రాజెక్ట్‌గా నిర్వహిస్తున్న స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని నిర్వహించారు. 7వ రోజు కార్యక్రమాన్ని పురస్కరించుకుని పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ, అడిషనల్ కమిషనర్ సుధాకర్‌లు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథం పనితీరును పరిశీలించారు. ఘన వ్యర్థాలు విక్రయించి నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసిన ప్రజలతో వారు మాట్లాడారు. గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జ్యోతిబసు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వి.రవి, గ్రామ సర్పంచ్ నల్లపాటి లలితకుమారి, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి



పొన్నూరు: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ వి.శంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని పంట పొలాల్లో చేపడుతున్న నీటి కుంటలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో నీటి కుంటలు మంజూరై ఇంకా ప్రారంభం కాని వాటిని వెంటనే ప్రారంభించి నీటి కుంటల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్మికులకు 100 రోజుల పని కల్పించడమే లక్ష్యంగా సిబ్బంది బాధ్యతలు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర రావు, ఏపీవో సుభాషిణి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో సూపర్ మోసాలు



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఇంటింటికీ బాండ్లు... ప్రశ్నిస్తే దాడికి పాల్పడడం
- త్వరలోనే ప్రజలు తిరగబడతారు
- వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ ప్రకటించి.. ఎన్నికల తరువాత సూపర్ మోసాలుగా కూటమి ప్రభుత్వం ప్రజలను వంచించింది అని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని 6వ వార్డులో పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అధ్యక్షతన బాబు రీకాలింగ్ మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజల్ని ఏ విధంగా మోసం చేస్తోందో క్యూ ఆర్ కోడ్ ద్వారా తెలుసుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేమారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఇతర మంత్రులు సూపర్‌సిక్స్ అంటూ ప్రచారం చేసి, తల్లికి వందనాన్ని సగానికి సగం మందికి పైగా తీసివేశారని అన్నారు. పెన్షన్లు పెంచుతున్నామంటూ చెప్పి కోతలు ప్రారంభించారని మండిపడ్డారు. త్వరలోనే కూటమి నాయకులకు ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుల ఎలీషా, జి.గాలయ్య, స్నేహ సంధ్య, దర్శి విజయశ్రీ, చిన్నపోతుల దుర్గారావు, మాజీ కౌన్సిలర్ వేముల రోజా, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై పెరుగుతున్న దాడులు



మాట్లాడుతున్న చిలువూరు ఫిలోమినా

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వంలో మహిళలపై అరాచకాలు పెరిగాయని.. తాజాగా కృష్ణాజిల్లా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పల హారికపై దాడి ఘటనే అందుకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు ధ్వజమెత్తారు. ఆత్మకూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ మహిళా సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చిలువూరు ఫిలోమినా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. పట్టణ అధ్యక్షురాలు సంకే సునిత, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షురాలు పచ్చల రత్నకుమారి మాట్లాడుతూ.. మహిళా జిల్లా పరిషత్ చైర్మన్ పర్యటనను అడ్డుకుని మారణాయుధాలతో దాడి చేయడం దారుణమని అన్నారు. గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, తాడేపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ మాట్లాడుతూ.. మహిళలు బయటకు వస్తే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సి వస్తోందని వాపోయారు. కార్యక్రమంలో దుగ్గిరాల మండల మహిళా అధ్యక్షురాలు పెండ్యాల సంసోనమ్మ, తాడేపల్లి మండల మహిళా అధ్యక్షురాలు గోరా నాగ స్రవంతి, మంగళగిరి పట్టణ 15వ వార్డు మాజీ కౌన్సిలర్ కలకోటి స్వరూపారాణి, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి తుమ్మ పద్మ, మంగళగిరి పట్టణ కార్యదర్శి గుంటి రాజ్యలక్ష్మి, మిట్ట నిర్మల తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న చిన్ని తిరుపతయ్య

తాడేపల్లి రూరల్: పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపే విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతయ్య, ప్రభాకర్‌లు మాట్లాడుతూ.. ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరర్యావు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, బత్తూరి మోహనరావు, బాపనపల్లి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు బాపనపల్లి వెంకటేశ్వరరావు, రత్నకుమార్, రవి, సీపీఎం సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, సీపీఐఎంఎల్ నాయకులు కూరపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శ వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. శుక్రవారం మంగళగిరి కార్యాలయంలో పట్టణ కమిటీ, శాఖా కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ, వై.కమలాకర్, పట్టణ కమిటీ సభ్యులు గణేష్, ఎం.చలపతిరావు, వి.శ్రీనివారావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: స్మార్ట్ మీటర్ల వల్ల పేదలపై భారాలు పడుతున్నాయని సీపీఎం కార్మిక నాయకులు జెట్టి బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని చిలువూరులో స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలంటూ కరపత్రాల ద్వారా ప్రజలకు చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో ఎం.కోటేశ్వరరావు, కె.బిక్షాలు, దిబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి



దీక్షా శిబిరంలో కార్మికులు, నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 227వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ.. కార్మికులకు న్యాయంగా రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పట్టుదలతో దీక్షలో కూర్చుంటున్న అక్కచెల్లెమ్మలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఇదే చైతన్యంతో కొనసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ కమిటీ సభ్యులు దామవరపు నాగేశ్వరరావు, గురవయ్య, సాంబశివరావు, కె.ఆదినారాయణ, ఆశీర్వాదం, కార్మికులు గడికోట జ్యోతి, వేమురిబ్కా, మొలక శారద, సువర్ణకుమారి, రమాదేవి, రమణమ్మలు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

తాడికొండ: సచివాయలంలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని.. పెండింగ్‌లో ఉన్న జీతం పీఎఫ్, ఈఎస్ఐ, కార్మికులను కాంట్రాక్ట్ ఔట్ స్సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.రవి, ఎం.భాగ్యరాజ్ కోరారు. సీఐటీయూ రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సీఆర్డీయే కార్యాలయంలో శుక్రవారం వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువరు సచివాలయ పారిశుద్ధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.